ప్రపంచ చెస్ చాంప్ దివిత్‌రెడ్డి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ యువ చెస్ ప్లేయర్ అదుల్ల దివిత్‌రెడ్డి సంచలనం సృష్టించాడు. అల్బేనియా వేదికగా జరుగుతున్న ప్రపంచ క్యాడెట్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ అండర్-8 ఓపెన్ విభాగంలో దివిత్‌రెడ్డి విజేతగా నిలిచాడు. మొత్తం 11 రౌండ్ల తర్వాత దివిత్ 10 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. టోర్నీలో 10 గేముల్లో గెలిచిన ఈ చెస్ చిచ్చరపిడుగు ఒక గేమ్‌లో ఓటమి ఎదుర్కొన్నాడు. బ్లిట్జ్‌లో దివిత్ కాంస్యం దక్కించుకన్నాడు. మరోవైపు అండర్-12 బాలికల విభాగంలో శ్రావణిక చాంపియన్‌గా నిలిచి ఆకట్టుకుంది.

క్వార్టర్స్‌లో భారత్

5-0తో ఇంగ్లండ్‌పై ఘన విజయం

థామస్ కప్ టోర్నీ

చెంగ్డూ: థామస్ కప్ ఫైనల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత షట్లర్లు జోరు కొనసాగిస్తున్నారు. చెంగ్డూ (చైనా) వేదికగా జరుగుతున్న ఈ ఈవెంట్‌లో భాగంగా భారత్ 5-0 తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తుగా ఓడించి క్వార్టర్స్ బెర్తు ఖరారు చేసుకుంది. ముగ్గురు సింగిల్స్ ఆటగాళ్లు హెచ్‌ఎస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్, కిరణ్ జార్జితో పాటు డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్-చిరాగ్, అర్జున్-ధ్రువ్ వరుస విజయాలతో అదరగొట్టారు. మొదటి సింగిల్స్‌లో ప్రపంచ 9వ ర్యాంకర్ ప్రణయ్.. 21-15, 21-15 తేడాతో హ్యారీ హువాంగ్‌ను ఓడించి భారత్‌ను ఆధిక్యంలోకి తెచ్చాడు. ఆ తర్వాత డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్.. 21-17, 19-21, 21-15 తేడాతో ప్రపంచ 3వ ర్యాంకు జంట బెన్ లేన్-సీన్‌ను ఓడించింది. రెండో సింగిల్స్‌లో శ్రీకాంత్.. 21-16, 21-19 నదీమ్ దల్విపై వరుస సెట్లలో గెలిచి భారత్‌కు విజయాన్ని ఖాయం చేశాడు. రెండో డబుల్స్‌లో అర్జున్-కపిల్ ద్వయం 21-17, 21-19 తేడాతో రోరీ ఈస్టన్ - అలెక్స్ గ్రీన్‌పై గెలిచింది. ఆఖరి సింగిల్స్‌లో కిరణ్ జార్జి 21-18, 21-12 తేడాతో చమన్ చౌనన్‌ను ఓడించి ఇంగ్లండ్‌పై విజయాన్ని పరిపూర్ణం చేశాడు.

భవానీ దేవీకి షాక్

ఫుజైర: మూడేండ్ల క్రితం టోక్యో (జపాన్) వేదికగా ముగిసిన ఒలింపిక్స్‌లో భాగంగా భారత్ తరపున ఫెన్సింగ్ ఆడిన తొలి క్రీడాకారిణిగా గుర్తింపు పొందిన భవానీ దేవీ పారిస్ ఒలింపిక్స్ బెర్తును దక్కించుకోవడంలో విఫలమైంది. యూఏఈలోని ఫుజైర వేదికగా జరుగుతున్న ఆసియా ఒషియానియా జోనల్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో ఆమె సెమీస్‌లోనే నిష్క్రమించింది. ఈ టోర్నీ ఫైనల్‌లో గెలిచిన విజేతలు మాత్రమే విశ్వక్రీడలకు అర్హత సాధించనుండగా ఒలింపిక్స్‌కు ఇవే చివరి క్వాలిఫయర్స్.

కివీస్ గ్యాంగ్ ఇదే..

టీ20 ప్రపంచకప్ టోర్నీకి ఎంపిక

వెల్లింగ్టన్: మరికొద్దిరోజుల్లో వెస్టిండీస్/అమెరికా వేదికగా జరుగనున్న ఐసీసీ టీ20 వరల్డ్ కప్ కోసం న్యూజిలాండ్ బోర్డు జట్టును ప్రకటించింది. 15 మందితో కూడిన ఈ జట్టును కేన్ విలియమ్సన్ నడిపించనుండగా స్టార్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ తిరిగి జాతీయ జట్టుతో చేరాడు. విలియమ్సన్‌కు ఇది ఆరో టీ20 ప్రపంచకప్ కాగా సారథిగా నాలుగోది. అనుభవజ్ఞులు, యువ ఆటగాళ్లతో సమతూకంగా ఉన్న కివీస్.. ప్రపంచకప్ గ్రూప్ దశలో వెస్టిండీస్, ఉగాండా, పపువా న్యూగినియా, అఫ్గానిస్థాన్‌తో ఆడనుంది.

న్యూజిలాండ్ జట్టు: కేన్ విలియమ్సన్ (కెప్టెన్), అలెన్, బౌల్ట్, బ్రాస్‌వెల్, చాప్‌మన్, కాన్వే, ఫెర్గూసన్, హెన్రీ, మిచెల్, నీషమ్, ఫిలిప్స్, రచిన్, శాంట్నర్, ఇష్ సోధీ, టిమ్ సౌథీ

కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. గత మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ చేతిలో ఘోర ఓటమి ఎదుర్కొన్న కోల్‌కతా..సొంత ఇలాఖా ఈడెన్‌గార్డెన్స్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ భరతం పట్టింది. వైభవ్ అరోరా ఆదిలోనే ఢిల్లీని దెబ్బకొట్టగా, మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మిడిల్‌ను కుప్పకూల్చాడు. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన క్యాపిటల్స్.. ఆఖర్లో కుల్దీప్‌యాదవ్ బ్యాటింగ్‌తో పరువు దక్కించుకుంది. లక్ష్యఛేదనలో ఫిల్‌సాల్ట్ బౌండరీలతో దుమ్మురేపితే..శ్రేయాస్ అయ్యర్, వెంకటేశ్ అయ్యర్ గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశారు. ఈ విజయంతో ప్లేఆఫ్స్ బెర్తుకు మరింత చేరువ కాగా, ఢిల్లీ మరో ఓటమిని ఖాతాలో వేసుకుంది.

కోల్‌కతా: ఈడెన్‌గార్డెన్స్‌లో చప్పగా సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై కోల్‌కతా నైట్‌రైడర్స్‌దే పైచేయి అయ్యింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 7 వికెట్ల తేడాతో ఢిల్లీపై భారీ విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన ఢిల్లీ..బ్యాటింగ్ ఎంచుకుంది. గత మ్యాచ్‌లో రికార్డులు బద్దలైన వేళ ఈ మ్యాచ్‌లోనూ పరుగుల వరదే అనుకున్న అభిమానులకు నిరాశే ఎదురైంది. వరుణ్ చక్రవర్తి(3/16), హర్షిత్ రానా(2/28), వైభవ్ అరోరా(2/29) ధాటికి ఢిల్లీ 20 ఓవర్లలో 153/9 స్కోరు చేసింది. కుల్దీప్‌యాదవ్(35 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలువగా, ప్రధాన బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. భీకరమైన ఫామ్‌లోఉన్న జేక్ ఫ్రేజర్(12) తీవ్రంగా నిరాశపరిచాడు. గాయం నుంచి కోలుకుని జట్టులోకి వచ్చిన అరోరా..ఢిల్లీని ఘోరంగా దెబ్బకొట్టగా, మిగతా పనిని చక్రవర్తి పూర్తి చేశాడు. ఆ తర్వాత స్వల్ప లక్ష్యఛేదనలో కేకేఆర్ ఓపెనర్ ఫిల్ సాల్ట్(33 బంతుల్లో 68, 7ఫోర్లు, 5 సిక్స్‌లు) జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. పసలేని ఢిల్లీ బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ సాల్ట్ బౌండరీలతో చెలరేగాడు. బౌలర్ ఎవరన్నది లెక్కచేయని సాల్ట్ ఈ క్రమంలో 26 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. దీంతో పవర్ ప్లే ముగిసే సరికి వికెట్ కోల్పోకుండా 79 పరుగులు చేసింది. అక్షర్ బౌలింగ్‌లో సునీల్ నరైన్(15) ఔటయ్యాడు. మూడో డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన రింకూసింగ్(11) నిరాశ పరిచినా..శ్రేయాస్, వెంకటేశ్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తపడుతూ జట్టును గెలుపు తీరాలకు చేర్చారు. వీరిని విడదీసేందుకు పంత్ ప్రయత్నించినా..ఢిల్లీ పేలవ ఫీల్డింగ్ అవకాశాలను దెబ్బతీసింది.

సమిష్టి ప్రదర్శనతో విజృంభణ

కోల్‌కతా కమాల్

రాణించిన చక్రవర్తి, సాల్ట్

ఢిల్లీపై ఘన విజయం

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	9	8	1	0.69	16
కోల్‌కతా	9	6	3	1.09	12
చెన్నై	9	5	4	0.81	10
హైదరాబాద్	9	5	4	0.07	10
లక్నో	9	5	4	0.05	10
ఢిల్లీ	11	5	6	-0.44	10
గుజరాత్	10	4	6	-1.11	8
పంజాబ్	9	3	6	-0.18	6
ముంబై	9	3	6	-0.26	6
బెంగళూరు	10	3	7	-0.41	6

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లలో 153/9(కుల్దీప్ 35 నాటౌట్, పంత్ 27, చక్రవర్తి 3/16, రానా 2/28), కోల్‌కతా: 16.3 ఓవర్లలో 157/3(సాల్ట్ 68, శ్రేయాస్ 33 నాటౌట్, అక్షర్‌పటేల్ 2/25, విలియమ్స్ 1/38)

సెలెక్టర్ల భేటీ నేడే

- **టీ20 ప్రపంచకప్ జట్టు ఎంపికపై సమావేశం**

న్యూఢిల్లీ: వెస్టిండీస్, అమెరికా వేదికలుగా జరుగనున్న ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ టోర్నీకి భారత జట్టు ఎంపికపై ఆసక్తి నెలకొన్నది. మంగళవారం అహ్మదాబాద్‌లో జాతీయ సెలెక్టర్లు మెగాటోర్నీకి జట్టు ఎంపిక చేయడంపై భేటీ కానున్నారు. అయితే టీమ్ ప్రకటనకు మరో రోజు పట్టే అవకాశమున్నట్లు కనిపిస్తున్నది. బీసీసీఐ కార్యదర్శి జై షా రాజకీయ వ్యవహారాల్లో బిజీగా ఉన్న కారణంగా అహ్మదాబాద్ భేటీ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే రెండో వికెట్‌కీపర్‌తో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా స్థానంపై సెలెక్షన్ మీటింగ్‌లో ప్రధానంగా చర్చ జరిగే అవకాశముంది. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్‌లో మంచి ఫామ్‌మీదున్న సంజూ శాంసన్ (385), కేఎల్ రాహుల్ (378) రెండో వికెట్‌కీపర్ బెర్తు కోసం పోటీపడుతున్నారు.

సెలెక్షన్స్ లేకుండానే..

ఢిల్లీ: కొద్దిరోజుల క్రితమే బిష్కెక్ వేదికగా ముగిసిన ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో తీవ్రంగా నిరాశపరిచి ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకోలేకపోయిన రెజ్లర్లే త్వరలో ఇస్తాంబుల్ (టర్కీ)లో జరుగబోయే వరల్డ్ ఒలింపిక్ గేమ్స్ క్వాలిఫయర్స్‌లోనూ బరిలోకి దిగనున్నారు. మే 9-13 మధ్య జరగాల్సి ఉన్న ఈ పోటీలే భారత మల్ల యోధులకు ఒలింపిక్స్‌లో కోటా ఖాయం చేసుకోవడానికి ఉన్న చివరి అవకాశం. బిష్కెక్‌లో వినేశ్ ఫోగట్, అన్షు మాలిక్, రీతిక మినహా మిగిలిన రెజ్లర్లు విఫలమయ్యారు. దీంతో తిరిగి సెలెక్షన్స్ ట్రయల్స్ నిర్వహించి వారిని ఇస్తాంబుల్‌కు పంపాలని భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) భావించినా సమయం తక్కువగా ఉండటంతో బిష్కెక్ టీమ్‌నే ఎంపికచేసింది.

చాంపియన్స్ ట్రోఫీకి వేదికలు ఖరారు

లాహోర్: వచ్చే ఏడాది పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో వేదికలను పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఖరారు చేసింది. పాక్‌లోని ప్రఖ్యాత లాహోర్ (గడాఫీ), కరాచీ (నేషనల్ స్టేడియం), రావల్పిండి స్టేడియాలలో మ్యాచ్‌ల నిర్వహించేందుకు సన్నాహకాలు చేస్తున్నట్లు పీసీబీ చీఫ్ మోహిసీన్ నఖ్వీ తెలిపాడు. ఈ స్టేడియాలలో వసతులు, అంతర్జాతీయ స్థాయిలో సదుపాయాలు కల్పించేందుకు గాను అభివృద్ధి పనులు చేపట్టామని, వాటిని రాబోయే నాలుగైదు నెలల్లో పూర్తిచేశామని వెల్లడించాడు. దీనిపై ఐసీసీ అధికారిక ప్రకటన వెలువరించాల్సి ఉంది.

దుబాయ్ వేదికగా జరిగిన ఏషియన్ జూనియర్ అథ్లెటిక్స్‌లో పతకాలు కొల్లగొట్టిన భారత ప్లేయర్లు సోమవారం స్వదేశానికి చేరుకున్నారు. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో జాతీయ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.

'టాప్స్'లోకి ఆర్చర్ దీపిక

ఢిల్లీ: రెండ్రోజుల క్రితమే షాంఘై వేదికగా ముగిసిన ఆర్చరీ వరల్డ్ కప్ గ్రూప్ స్టేజ్-1లో మహిళల వ్యక్తిగత రికర్వ్ ఈవెంట్‌లో రజతం గెలిచిన భారత సీనియర్ రికర్వ్ ఆర్చర్ దీపికా కుమారి టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్)లో చోటు దక్కించుకుంది. ఈ మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఉన్న మిషన్ ఒలింపిక్ సెల్ (ఎంవోసీ) సోమవారం ఈ నిర్ణయం తీసుకుంది. గతేడాది బిడ్డకు జన్మనివ్వడంతో ఆటకు దూరమైన దీపిక.. ఇటీవల దేశవాళీతో పాటు అంతర్జాతీయ స్థాయిలోనూ రాణిస్తోంది. దీపికతో పాటు మరో ఆర్చర్ మృణాల్ చౌహాన్, స్క్వాష్ ప్లేయర్లు అనంత్ సింగ్, అభయ్ సింగ్, వెలవన్ సెంథిల్ కుమార్‌నూ టాప్స్‌లో చేర్చుతున్నట్లు ఎంవోసీ ప్రకటనలో పేర్కొంది.

మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో

ప్రారంభ ధర రూ.7.49 లక్షలు

వాణిజ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: కాంపాక్ట్ ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా మహీంద్రా అండ్ మహీంద్రా సరికొత్త మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన ఎక్స్‌యూవీ 300ని అప్‌డేట్ చేసి డిజైనింగ్, ఫీచర్స్, భద్రత పరంగా పలు మార్పులు చేసి మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు ప్రారంభ ధర 7.49 లక్షలుగా నిర్ణయించింది. మహీంద్రా సరికొత్తగా ఈ మాడల్‌లో పానోరామిక్ సన్‌రూఫ్, ఏడు స్పీకర్లు, డ్యూయల్-జోన్ క్లైమెట్ కంట్రోల్ సిస్టమ్ వంటి ఫీచర్లతో తీర్చిదిద్దింది. ఆరు స్పీడ్ మాన్యువల్ లేదా ఆటోమేటిక్ వెర్షన్‌ను 1.5 లీటర్ల టర్బో డీజిల్ ఇంజిన్, 1.2 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో రూపొందించింది.

పెరిగిన నగదు వాడకం

ఏటీఎంల నుంచి జోరుగా క్యాష్ విత్‌డ్రాయల్స్

వెల్లడించిన సీఎంఎస్ ఇన్ఫోసిస్టమ్స్

ముంబై, ఏప్రిల్ 29: భారత్.. మళ్లీ నగదు లావాదేవీల వైపు వెళ్తున్నదా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తున్నది. దేశంలో గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఏటీఎంల నుంచి నెలవారీ నగదు ఉపసంహరణల సగటు రూ.1.43 కోట్లుగా ఉన్నదని ప్రముఖ క్యాష్ లాజిస్టిక్స్ కంపెనీ సీఎంఎస్ ఇన్ఫోసిస్టమ్స్ తాజాగా తెలియజేసింది. కేంద్ర ప్రభుత్వం డిజిటల్ ఇండియా అంటూ ఊదరగొడుతున్న నేపథ్యంలో నిజంగా ఇది ప్రాధాన్యత గల అంశమే. ఓవైపు యూపీఐ పేమెంట్స్ రికార్డు స్థాయిలో జరుగుతున్నా.. ప్రజల్లో నగదు వినియోగానికున్న ప్రాముఖ్యత స్పష్టంగా కనిపిస్తుండటం గమనార్హం. ఇక అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోల్చితే 2023-24లో ఏటీఎంల్లో 5.51 శాతం క్యాష్ విత్‌డ్రాయల్స్ పెరిగాయని సోమవారం సీఎంఎస్ ఇన్ఫోసిస్టమ్స్ తమ నివేదిక 'అన్‌ఫోల్డింగ్ ఇండియాస్ కన్జంప్షన్ స్టోరీ'లో వెల్లడించింది. నాడు రూ.1.35 కోట్లేనని తెలిపింది. ముఖ్యంగా మెట్రో నగరాల్లో నగదు ఉపసంహరణలు పెరగడం విశేషంగా చెప్పుకోవచ్చు. గతంతో చూస్తే 10.37 శాతం పెరిగాయి మరి. సెమీ-అర్బన్, రూరల్ ఏరియాల్లో 3.94 శాతం, సెమీ-మెట్రో నగరాల్లోనూ 3.73 శాతం క్యాష్ విత్‌డ్రాయల్స్ ఎక్కువయ్యాయి. ఏటీఎంల నుంచి నెలవారీ క్యాష్ విత్‌డ్రాయల్స్ సగటులో రాష్ట్రాలవారీగా చూస్తే.. రూ.1.83 కోట్లతో కర్నాటక ముందున్నది. న్యూఢిల్లీ (రూ.1.82 కోట్లు), పశ్చిమ బెంగాల్ (రూ.1.62 కోట్లు) తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

సుప్రీం కోర్టులో ఎల్‌అండ్‌టీకి ఎదురుదెబ్బ

షరావతి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు మెయిల్‌కే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: ఎల్‌అండ్‌టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ చేపట్టిన కేపీసీఎల్ షరావతి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు టెండర్ ప్రక్రియపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఎల్‌అండ్‌టీకి నిరాశే ఎదురైంది. చివరకు ఈ ప్రాజెక్టు మెఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ దక్కించుకున్నది. ఈ టెండర్ ప్రక్రియకు వ్యతిరేకంగా కర్ణాటక హైకోర్టును ఆశ్రయించి భంగపడ్డ ఎల్‌అండ్‌టీ.. ఆ తర్వాత సుప్రీంలో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. మెయిల్, కేపీసీఎల్‌ను ప్రతివాదులుగా చేర్చింది. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు.. ఎల్‌అండ్‌టీ పిటిషన్‌ను సోమవారం కొట్టివేసింది. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్‌పై వాదనలు సుదీర్ఘంగా విన్న తర్వాత పిటిషన్‌ను కొట్టివేసింది. టెండర్ దాఖలుకు రాష్ట్రం తగినంత సమయం మంజూరు చేసిందని, ఆ సంస్థ బిడ్‌ను సమర్పించలేకపోయిందని పేర్కొంది. ఎలక్ట్రో-మెకానికల్, హైడ్రో-మెకానికల్ పనులలో అనుభవం లేని ఎల్‌అండ్‌టీ ఈ టెండర్లలో పాల్గొనడానికి అర్హత లేదని తెలిపింది. దీంతో రూ.8 వేల కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న 2000 మెగావాట్ల షరావతి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు మెఘా వశమైంది.

స్మార్ట్‌బజార్ 'ఫుల్ పైసా వసూల్'

హైదరాబాద్, ఏప్రిల్ 29: రిలయన్స్‌కు చెందిన స్మార్ట్‌బజార్, జియోమార్ట్‌లు ప్రత్యేకంగా 'ఫుల్ పైసా వసూల్' పథకానికి తెరలేపారు. మే 1 నుంచి 5 వరకు అందుబాటులో ఉండనున్న ఈ ప్రత్యేక ఆఫర్ కింద అన్ని రకాల ఉత్పత్తులపై రాయితీ ఇస్తున్నది. స్మార్ట్ బజార్ స్టోర్లు, జియమార్ట్ యాప్‌లో లభించనున్న ఫ్యాషన్, గృహోపకరణాలు, వంటసామాగ్రిలను తగ్గింపు ధరకే విక్రయిస్తున్నట్లు ప్రకటించింది.

హైసియా ప్రెసిడెంట్‌గా ప్రశాంత్ నాదెళ్ల

హైదరాబాద్, ఏప్రిల్ 29: హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్(హైసియా) నూతన ప్రెసిడెంట్‌గా ప్రశాంత్ నాదెళ్ల నియమితులయ్యారు. ఈ నియామకం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు వచ్చే ఏడాది కూడా వర్తించనున్నది. 32వ హైసియా వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశమై నూతన కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రస్తుతం ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్న మనీషా సాబూ స్థానాన్ని ప్రశాంత్ నాదెళ్ల భర్తీ చేయనున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ప్రశాంత్..వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. వైస్ ప్రెసిడెంట్‌గా బిపిన్ పెండ్యాల, జాయింట్ సెక్రటరీగా వినయ్ అగ్రావాలా నియమితులయ్యారు.

దేశీయ ఎగుమతులకు దెబ్బే

ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో పతనానికి అవకాశం

డిమాండ్‌పై భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం: ఎఫ్ఐఈవో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు.. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో దేశీయ ఎగుమతుల్ని ప్రభావితం చేయవచ్చని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) ఆందోళన వ్యక్తం చేసింది. ఆయా దేశాల్లో నెలకొన్న ఉద్రిక్తకర పరిస్థితులు.. అంతర్జాతీయ మార్కెట్‌లోని డిమాండ్‌ను దెబ్బ తీయవచ్చని ఎఫ్ఐఈవో డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ అభిప్రాయపడ్డారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం.. అంతర్జాతీయ అనిశ్చితికి దారి తీసిందని, ఇప్పటికే గత ఆర్థిక సంవత్సరం (2023-24) భారతీయ ఎగుమతులు తగ్గాయని గుర్తుచేశారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోల్చితే దిగుమతులు 3.11 శాతం పడిపోయి 437 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. దిగుమతులూ 8 శాతం పతనమై 677.24 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు తాజాగా తెలియజేశారు. 'అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ రకమైన విపత్కర పరిస్థితులు ఇలాగే కొనసాగితే.. తప్పక డిమాండ్ పడిపోతుంది. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికం గణాంకాల్లోనే అది కనిపించవచ్చు' అని అజయ్ సహాయ్ అన్నారు. కాగా, భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితులతోపాటు అధిక ద్రవ్యోల్బణం, పెరిగిన వడ్డీరేట్లు కూడా డిమాండ్ మందగమనానికి కారణమేనని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాబోయే రోజుల్లో ఐరోపా దేశాల్లో ఈ మందగమనం తీవ్రత ఎక్కువగా ఉండొచ్చన్నారు.

ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంపై..

ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ప్రభావంపై అజయ్ మాట్లాడుతూ.. భారత్ నుంచి యూఏఈ, ఇరాన్‌లకు వెళ్లే ఇంజినీరింగ్ ఉత్పత్తులకు డిమాండ్ పడిపోవచ్చని చెప్పారు. ఆభరణాల ఎగుమతులకూ ఇబ్బందేనన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ రంగాల్లోని వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు ద్రవ్యపరమైన దన్ననివ్వాలన్నారు. ప్రధానంగా ఎగుమతిదారులకు వడ్డీ రాయితీలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇదిలావుంటే భారత్ నుంచి ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్, టెలీకమ్యూనికేషన్, మెషినరీ, ఆటో, ఫార్మా, మెడిసిన్, డయాగ్నోస్టిక్స్ వంటి సాంకేతిక, నైపుణ్య ఆధారిత రంగాల ఎగుమతులు 2030 నాటికి లక్ష కోట్ల డాలర్ల మార్కును తాకగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అయితే దుస్తులు, పాదరక్షలు, రత్నాలు-ఆభరణాల వంటి కార్మిక శక్తి ఆధారిత రంగాల వాటా దేశీయ ఎగుమతుల్లో పడిపోతున్నదని ఒకింత ఆందోళన వెలిబుచ్చారు.

ఆకట్టుకున్న బ్యాంకింగ్ షేర్లు

భారీ లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు • సెన్సెక్స్ 941, నిఫ్టీ 223 పాయింట్లు వృద్ధి

ముంబై, ఏప్రిల్ 29: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం తిరిగి లాభాల బాట పట్టాయి. ఉదయం ఆరంభం నుంచే కొనుగోళ్ల జోష్‌లో ఉన్న మదుపరులు.. ఆఖరు దాకా అదే దారిలో దుసుకెళ్లారు. ఫలితంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 941.12 పాయింట్లు లేదా 1.28 శాతం పుంజుకుని 74,671.28 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో సూచీ 990.99 పాయింట్లు పెరగడం విశేషం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 223.45 పాయింట్లు లేదా 1 శాతం కోలుకుని 22,643.40 వద్ద నిలిచింది. బ్యాంకింగ్, మౌలిక రంగాల షేర్లకు పెద్ద ఎత్తున లభించిన కొనుగోళ్ల మద్దతే ఈ జోరుకు కారణమని మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల దృక్పథం కూడా కలిసొచ్చిందని అభిప్రాయపడుతున్నారు.

ఐసీఐసీఐ బ్యాంక్ టాప్

దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో రెండో అతిపెద్ద బ్యాంకైన ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు సెన్సెక్స్‌లో అత్యధిక లాభాలను సొంతం చేసుకున్నాయి. ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం 18.5 శాతం పెరిగిన నేపథ్యంలో షేర్ల విలువ సుమారు 5 శాతం ఎగిసింది. ఇండస్ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, యాక్సిస్, కొటక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లూ ఇన్వెస్టర్లను ఆకర్షించాయి. టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లూ చెప్పుకోదగ్గ లాభాలనే అందుకున్నాయి. అయితే హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు గరిష్ఠంగా దాదాపు 6 శాతం మేర నష్టాలను చవిచూశాయి. జనవరి-మార్చిలో నిరాశాజనక ఆర్థిక ఫలితాలే కారణమంటున్నారు. ఐటీసీ, విప్రో, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లూ మదుపరులను ఆకర్షించలేకపోయాయి.

ఆల్‌టైమ్ హైకి మదుపరుల సంపద

బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ ఆల్‌టైమ్ హైకి చేరింది. సోమవారం భారీ లాభాల మధ్య మదుపరుల సంపద మునుపెన్నడూ లేనివిధంగా రూ.406.52 లక్షల కోట్లను తాకింది. ఈ ఒక్కరోజే రూ. 2,48,043.51 కోట్లు ఎగబాకి రూ. 4,06,52,419.94 కోట్లకు వెళ్లింది. సెన్సెక్స్‌తోపాటు మిడ్, స్మాల్‌క్యాప్‌లూ పెరిగాయి.

రూపాయికి ఫెడ్ సెగ..

దేశీయ కరెన్సీ రూపాయికి అమెరికా ఫెడరల్ రిజర్వు సెగ గట్టిగానే తాకింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 7 పైసలు తగ్గి 83.45 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 10 పైసల వరకు నష్టపోయిన